స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

టీటీడీ చైర్మన్ భూమనకు సత్కారం



తిరుపతి కల్చరల్: టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని సోమవారం ఆయన స్వగృహంలో ఇస్కాన్ ప్రతినిధులు కలిసి ఘనంగా సత్కరించారు. ఆయనను కలిసిన వారిలో ఇస్కాన్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు రేవతి రమణదాస్, కార్పొరేటర్ రాధాకృష్ణారెడ్డి, ఇస్కాన్ మందిరం కార్యదర్శి, పీఆర్వో లాలాపారాయణదాస్ తదితరులు ఉన్నారు.

వెండి ఆభరణాల ప్రదర్శన ప్రారంభం



తిరుపతి కల్చరల్: బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో ఏర్పాటు చేసిన వెండి ఆభరణాల ప్రదర్శనను సోమవారం ప్రారంభించారు. షోరూం హెడ్ టీకే.రిజీష్ మాట్లాడుతూ వెండి ఆభరణాలతో పాటు వెండి వస్తువుల ప్రదర్శన ఈ నెల 20వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ప్రతి రూ.5 వేల వెండి ఆభరణాల కొనుగోలుపై రూ.500 ప్రత్యేక తగ్గింపు, వెండి వస్తువులపై ప్రత్యేక ఆఫర్లను కల్పిస్తున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం


పనులను పరిశీలిస్తున్న భూమన అభినయరెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగరం దశాబ్దాలుగా ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాజీలేని నిర్ణయాలు అమలు చేస్తున్నట్లు డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం భవానీనగర్‌లోని టీటీడీ ఏడీ బిల్డింగ్‌కు దక్షిణ వైపు రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు వెడల్పు 15 అడుగులు కూడా లేకపోవడంతో సమస్యగా మారిందన్నారు. కాలువపై శ్లాబ్ వేయడం ద్వారా 20 అడుగులకు పైగా విస్తరించవచ్చన్నారు. దీన్ని విస్తరించి వీవీ మహల్ రోడ్డుకు ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే నగరంలో రోడ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్‌లతో ట్రాఫిక్ సమస్యకు కొంత పరిష్కారం లభించిందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూనే వాటికి శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామన్నారు. 50 డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. అవసరమైన మేరకు నగర వ్యాప్తంగా సీసీ రోడ్లు, మురుగు కాలువలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎస్‌ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, డీఈ గోమతి, 34, 35వ డివిజన్ల అధ్యక్షులు మునిరామిరెడ్డి, దినేష్ రాయల్, అశోక్‌రెడ్డి, చందూ రాయల్ పాల్గొన్నారు.

మాజీ సైనికులకు ఘన సన్మానం



తిరుపతి అర్బన్: దేశానికి సేవ చేసిన వీరులను సన్మానించడం సంతోషంగా ఉందని ఇన్‌చార్జి కలెక్టర్ బాలాజీ తెలిపారు. యువజన సర్వీసుల శాఖ నేతృత్వంలో సోమవారం నా మట్టి- నాదేశం కార్యక్రమంలో భాగంగా మాజీ సైనికులు ఆనందరెడ్డి, హరినాథరెడ్డి, అణ్ణములునాయుడు, రామచంద్రయ్య, ఆంజనేయుడు, సుబ్బారెడ్డి, ప్రకాష్‌నాయుడును సత్కరించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి విజయశంకర్ రెడ్డి, సెట్విన్ అధికారులు మురళీకృష్ణ, మోహన్‌కుమార్, పౌరసంబంధాల అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

కమ్మకండ్రిగ సర్పంచ్‌గా కాకర్ల కావ్య

రామచంద్రాపురం: కమ్మకండ్రిగ సర్పంచ్‌గా కాకర్ల కావ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకర్ల లక్ష్మమ్మ మృతితో ఉప ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. గ్రామస్తులు లక్ష్మమ్మ కుటుంబానికే సర్పంచ్ పదవి ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కావ్య, చంద్రమౌళి మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం చంద్రమౌళి నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో కావ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రవి శేఖర్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం ఆమెకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వేణు, ఎంపీడీవో మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.

పీవీపురంలో గడప గడపకూ మీ హర్షిత్


గ్రామస్తులకు పథకాలు వివరిస్తున్న హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన మేలును, సంక్షేమాన్ని గుర్తించుకుని వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని గెలిపించాలని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం పీవీపురం పంచాయతీ పీవీపురం గిరిజన కాలనీ, గంగమాంబపురం, బలిజపల్లి, బలిజపల్లి దళితవాడ, సంజీవరాయపురంలో సోమవారం గడప గడపకూ మీ హర్షిత్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, మునీంద్రబాబు, మండల ఇన్‌చార్జి గణపతినాయుడు, సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ టెండూల్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి తుడా: ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఒకే ఫిర్యాదు మళ్లీ వస్తే సంబంధిత అధికారి బాధ్యత వహించాలన్నారు. రోడ్డు ఆక్రమణలు, అక్రమ కట్టడాలను ఉపేక్షించవద్దని సూచించారు. అదనపు కమిషనర్ సునీత, డెప్యూటీ కమిషనర్ చంద్రమౌళేశ్వరరెడ్డి, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, కార్యదర్శి రాధిక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లోనూ రాణించాలి


ఫ్యాషన్ షోలో పాల్గొన్న మేయర్ శిరీష

తిరుపతి సిటీ : విద్యార్థినులు అన్ని రంగాల్లోనూ రాణించాలని మేయర్ శిరీష తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీలో ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థినులు సోమవారం ఫ్యాషన్‌షో నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరేందుకు నిర్విరామంగా కృషి చేయాలన్నారు. వీసీ భారతి మాట్లాడుతూ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు చేస్తే మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

ఎస్వీయూలో 110 జీవోను అమలు చేయాలి

తిరుపతి సిటీ : అకడమిక్ కన్సల్టెంట్స్ విషయంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 110ను తక్షణమే అమలు చేయాలని అకడమిక్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.కిషోర్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం ఎస్వీయూ వీసీ రాజారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో జీవో అమలులో వుందని, నెల్లూరు, ద్రావిడ, ఎస్వీ యూనివర్సిటీల్లో అమలు చేయకపోవడం తగదన్నారు.